సాక్షి అనకాపల్లి

బుధవారం ၊ 21 ၊ ఫిబ్రవరి ၊ 2024



ప్రతి పల్లె... ప్రగతి పథాన..

సుపరిపాలనలో రాష్ట్ర ప్రజల అభిమానాన్ని సీఎం జగన్ పొందారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. 8లో



లక్ష దీపోత్సవం.. 8లో

భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో లక్ష ప్రమిదల దీపాలంకరణ కార్యక్రమం కనుల పండువగా జరిగింది.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు గరిష్ట 31.6 నుంచి 32, కనిష్ట 23.8 నుంచి 24.5 డిగ్రీలు, తేమశాతం 72 నుంచి 74 కాగా గాలి గంటకు 5 కి.మీ.వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

నిబంధనలకు లోబడి ఆధార్, మీ-సేవ కేంద్రాలు పనిచేయాలి



ఎస్.రాయవరంలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ డీడీవో ఉదయశ్రీ

ఎస్.రాయవరం : ప్రభుత్వ నిబంధనలకు లోబడి మీసేవా , ఆధార్ సెంటర్లు నిర్వహించాలని విజిలెన్స్ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎం.ఉదయశ్రీ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పలు మీసేవ కేంద్రాలు, ఆధార్ సెంటర్లు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంటర్లు ఎక్కడ అనుమతి ఉంటే అక్కడే నిర్వహించాలన్నారు. మీ- సేవ ద్వారా అందిస్తున్న సేవలు వివరాలు వినియోగదారులకు తెలిసేలా ఉండాలన్నారు.

గుడివాడలో షూటింగ్ సందడి



చిత్ర యూనిట్, గుడివాడ గ్రామస్తులతో డైరెక్టర్ సుబ్బు మంగళ్‌దేవ్

ఎస్.రాయవరం : అల్లరి నరేష్ , అమ్రిత అయిర్, రావు రమేష్ తారాగణంలో తెరకెక్కనున్న బచ్చల మల్లి చిత్ర సన్నివేశాలు మంగళవారం గుడివాడ గ్రామంలో చిత్రీకరించారు. డైరెక్టర్ సుబ్బు మంగళ్‌దేవ్ పేరిచర్ల వెంకటేశ్వరరాజు ఇంట్లో కుటుంబ సన్నివేశం చిత్రీకరించారు. హీరో అల్లరి నరేష్ వచ్చారని తెలియడంతో స్థానికులు ఆయనను చూసేందుకు గుమిగూడారు. ఇంట్లో సన్నివేశం కావడంతో అభిమానులకు చూసేందుకు వీలు కుదరలేదు. ఇంట్లో ఎక్కువ సమయంలో సన్నివేశం చిత్రీకరించడంతో అభిమానులు నిరాశతో వెనుతిరిగారు. చిత్రీకరణ పూర్తయిన వెంటనే నటీనటులు బస్సుల్లోకి వెళ్లిపోయారు. షూటింగ్ బిజీ కారణంగా ప్రేక్షకులను కలవడానికి వీలవ లేదని డైరెక్టర్ తెలిపారు. మార్చి 5 వరకు ఈ చిత్రం షూటింగ్ తుని, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటఉరట్ల మండలాల్లో చిత్రీకరిస్తామన్నారు. జూలై నాటికి చిత్రీకరణ పూర్తవుతుందని, ఆగస్టు మొదటి వారంలో రిలీజ్ చేస్తామని చెప్పారు. సినిమా షూటింగ్‌తో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

మహిళ గర్భంలో 3.5 కిలోల కణితి



మహిళ గర్భం నుంచి తీసిన 3.5 కిలోల కణితి

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో మంగళవారం అరుదైన శస్త్రచికిత్స జరిగింది. తీవ్రమైన కడుపునొప్పితో ఈనెల 15న ఆస్పత్రిలో చీడికాడ మండలం తంగుబిల్లి గ్రామానికి చెందిన ఎస్.రమణమ్మ చేరిన మహిళకు గైనిక్ విభాగం వైద్యురాలు జ్యోత్స్నతో పాటు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావులు సదరు మహిళ గర్భం నుంచి 3.5 కిలోల కణితిని బయటకు తీసి మహిళకు సురక్షితంగా శస్త్రచికిత్స నిర్వహించారు. అంతకుముందు డైరెక్టర్ రామ్మూర్తి అన్ని వార్డులు పరిశీలించి శస్త్రచికిత్స చేసిన వైద్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో శ్రీనివాస్, పలు విభాగాల వైద్యులు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పట్టణ -1 అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో ఏడుగురికి పదోన్నతులు



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట: జిల్లా పరిషత్‌లో పలువురు ఉద్యోగులు పదోన్నతులు పొందారు. పదోన్నతులు పొందిన వారికి జడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం పోస్టింగ్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఆఫీస్ సబార్డినేట్లుగా పనిచేస్తున్న ఏడుగురికి రికార్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలను విజయవంతంగా నిర్వహించడంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని సుభద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, పరిపాలన విభాగం సెక్షన్ ఆఫీసర్ మంజులవాణి, కార్యాలయ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

స్టార్టప్ ఏరియాలో... వడివడిగా...

విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా గుర్తించిన స్టార్టప్ ఏరియాలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో నక్కపల్లి క్లస్టర్‌లో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుకు గతం లో బీజం పడింది. నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో పరిశ్రమల స్థాపన కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తాజాగా ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది.

- మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం సన్నాహాలు
- ఇండస్ట్రియల్ కారిడార్‌లో పనులకు రూ.399 కోట్లు



ఏపీఐఐసీ వారు సేకరించిన భూములు (ఇన్‌సెట్) పెండింగ్ సమస్యల పరిష్కారానికి రైతులతో గ్రామసభలు నిర్వహిస్తున్న దృశ్యం



నక్కపల్లి : ఎస్‌ఈజెడ్ కోసం స్టార్టప్ ఏరియా కింద 1120 ఎకరాలు సిద్ధం చేసినట్టు అధికారులు నివేదిక సమర్పించారు. దీంతో ఈ స్టార్టప్ ఏరియాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.399 కోట్లు విడుదల చేసింది. ఈ పనులకు ఇటీవల పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో ప్రభుత్వం నక్కపల్లిని క్లస్టర్‌గా చేర్చింది. 2010లో భూసేకరణ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫేజ్ 1లో 2246.98 ఎకరాల జిరాయితీ,1679.73 ఎకరాల ప్రభుత్వ భూములను సేకరించింది. వీటిలో జిరాయితీ, డిఫారం పట్టా , ప్రభుత్వ భూములతోపాటు, రైతుల ఆక్రమణలో ఉన్న భూములు కూడా ఉన్నాయి. ఈవిధంగా నక్కపల్లి మండలంలో చందనాడలో 847 ఎకరాల జిరాయితీ, 462 ఎకరాల ప్రభుత్వ భూములు, వేంపాడులో 308 ఎకరాల జిరాయితీ, 410 ఎకరాల ప్రభుత్వ భూములు, డీఎల్‌పురంలో 428 ఎకరాల జిరాయితీ, 414 ఎకరాల ప్రభుత్వ భూములు, రాజయ్యపేటలో 663 ఎకరాల జిరాయితీ, 221 ఎకరాల ప్రభుత్వ భూములు సేకరించింది. ఇవికాక ఎస్.నర్సాపురంలో 9 ఎకరాలు, బుచ్చిరాజుపేటలో 161 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా సేకరించింది. భూములిచ్చిన రైతులందరికీ నష్టపరిహారం , చెట్లు, నిర్మాణాలకు సైతం ప్రభుత్వం పరిహారం చెల్లించింది. ఇలా రైతుల నుంచి సేకరించిన సుమారు 4వేల ఎకరాల భూముల్లో ప్రత్యేక ఆర్థక మండలి (ఎస్‌ఈజెడ్) ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ ఎస్‌ఈజెడ్‌లో పరిశ్రమలు స్థాపించేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ, ప్రైవేటురంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఎస్‌ఈజెడ్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తే పరిశ్రమలు స్థాపించే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వం వారికి కావాల్సిన మౌలిక సదుపాయల కోసం 1120 ఎకరాలను స్టార్టప్ ఏరియా కింద గుర్తించింది. రాజయ్యపేటలో 29.66 ఎకరాలు, బుచ్చిరాజుపేటలో 5.98 ఎకరాలు, చందనాడలో 754.36 ఎకరాలు, వేంపాడులో 269.78 ఎకరాలు, డీఎల్‌పురంలో 60.22 ఎకరాలు సిద్ధం చేసింది. ఈ స్టార్టప్ ఏరియాలో ముందుగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వాడుకనీరు, విద్యుత్ సదుపాయాలు కల్పిస్తారు. వీటి కోసం ప్రభుత్వం మొదటి విడతగా ఇటీవల రూ.399 కోట్లు కేటాయించింది. అలాగే రోడ్డు కనెక్టవిటీ కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రధాన జాతీయ రహదారి నుంచి ఎస్‌ఈజెడ్‌కోసం సేకరించిన భూముల వరకు రెండు లేదా నాలుగులైన్ల రోడ్లు నిర్మించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో స్టార్టప్ ఏరియాలో అమలాపురం శివారు మూలపర సమీపంలో సబ్‌స్టేషన్ నిర్మించాలని నిర్ణయించింది.

ఇంకా అర్హులుంటే ప్రభుత్వం దృష్టికి...

వాస్తవంగా భూములు సేకరించిన రైతులందరికీ నష్టపరిహారం, భవనాలు, కట్టడాలు, చెట్లకు పరిహారం పూర్తిగా చెల్లించడం జరిగిందని అధికారులు చెబుతున్నారు. అన్ని గ్రామాల్లో కలిసి 40 ఎకరాల్లోనే పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఏపీఐఐసీ అధికారులు చెబుతున్నారు. డీఫారం భూములు, ప్రభుత్వ భూములకు పరిహారం చెల్లించగా వాటిని ఆనుకుని తాము సాగుచేస్తున్న భూములకు కూడా పరిహారం ఇవ్వాలని రైతుల నుంచి డిమాండ్ వస్తోంది. ఇలా పరిహారం చెల్లించడం నిబంధనలకు విరుద్ధమని, గతంలో సర్వే సమయంలో ఎంత సాగు చేస్తున్నారో ఆ మేరకు పరిహారం చెల్లించడం జరిగిందని అధికారులు చెబుతున్నారు. వివాదాస్పద భూములకు మాత్రమే పరిహారం చెల్లించలేదని, మా తప్పు లేదని, రైతులే తమకు పరిహారం కోసం దరఖాస్తు చేయలేదని వారు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను మరోసారి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, అర్హత ఉంటే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. వీలైనంత త్వరగా స్టార్టప్ ఏరియాలో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు ప్రారంభిస్తామని, రైతులు కూడా సహకరించాలని ఏపీఐఐసీ అధికారులు కోరుతున్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు

ఈ సబ్‌స్టేషన్ కోసం రేబాక నుంచి జాతీయ రహదారి మీదుగా 133 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైను ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి కాగిత, పాటిమీద, తమ్మయ్యపేట, చందనాడ మీదుగా రాజయ్యపేట వరకు కనెక్టవిటీ రోడ్డు కోసం భూసేకరణ చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం కాగిత రైతుల నుంచి సుమారు 60 సెంట్లు భూమి సేకరించాల్సి ఉంది. రైతులతో చర్చలు జరుపుతున్నారు. స్టార్టప్ ఏరియాలో పనులు ప్రారంభించేందుకు అధికారుల సిద్ధపడిన సమయంలో పలువురు నిర్వాసితులు పనులు అడ్డగించారు. పలువురు రైతులు తమకు ఇంకా నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని పూర్తి స్థాయిలో తమకు పరిహారం చెల్లించేవరకు పనులు చేపట్టొద్దని అభ్యంతరం వ్యక్తం చేయడంతో అధికారులు భూసేకరణ గ్రామాల్లో గడచిన నాలుగు రోజుల నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నారు.

రోడ్డు కోసం రైతులతో చర్చలు



ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూముల్లో నిర్వాసితులందరికీ పూర్తిగా నష్టపరిహారం చెల్లించడం జరిగింది. ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలి. పరిహారానికి అర్హత ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేస్తాం. మౌలిక సదుపాయల కల్పనకు అభ్యంతరం వ్యక్తం చేయడం తగదు. అధిక పరిహారానికి ఆశపడిన రైతులు మాత్రమే తమకు భూములు ఇవ్వలేదు. వారికి కూడా అవగాహన కల్పిస్తున్నాం. అలాగే కనెక్టవిటీ రోడ్డు కోసం రైతులతో చర్చలు జరుపుతున్నాం . ధర విషయం కొలిక్కివస్తే పరిహారం చెల్లించి భూములు స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది.

–త్రినాథ్, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- నేడు శ్రీశారదా పీఠానికి సీఎం వైఎస్ జగన్
- రాజశ్యామల యాగంలో పాల్గొననున్న సీఎం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విశాఖ శ్రీశారదా పీఠాన్ని సందర్శించనున్న నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మంగళవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, డీసీపీ-2 సత్యనారాయణ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఏర్పాట్లపై పీఠం ప్రతినిధులతో సమీక్షించారు. మధ్యాహ్నం ఎయిర్‌పోర్టు నుంచి పీఠం వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. సీఎంను చూసేందుకు భారీ ఎత్తున ప్రజలు తరలిరానుండడంతో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. చినముషిడివాడ ప్రధాన కూడలి నుంచి పీఠం వరకు ప్రత్యేకంగా రెయిలింగ్ అమర్చారు. మరోవైపు ముఖ్యమంత్రి హోదాలో నాలుగోసారి పీఠానికి వస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలికేందుకు పీఠం ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మరోవైపు సీఎంను సాదరంగా స్వాగతించేందుకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తయ్యాయి.

పర్యటన ఇలా..

బుధవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరనున్న సీఎం వైఎస్ జగన్ గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో 11.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో చినముషిడివాడలోని శ్రీశారదా పీఠానికి 11.40 గంటలకు వస్తారు. సంప్రదాయ వస్త్రాలు ధరించి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీతో కలిసి పీఠంలోని దేవతామూర్తులకు సీఎం జగన్ ప్రత్యేక పూజలు చేస్తారు. రాజశ్యామల యాగంలో పాల్గొంటారు. దాదాపు గంట పాటు పీఠంలో జరగనున్న పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో సీఎం పాలుపంచుకుంటారు. అనంతరం 12.55 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని గన్నవరం బయలుదేరుతారు.

కల్యాణమస్తు..షాదీ తోఫా



లబ్ధిదారులకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రవిపట్టన్ శెట్టి

- 604 జంటలకు రూ.3.57 కోట్లు విడుదల

అనకాపల్లి : జిల్లాలో వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా కింద 604 జంటలకు రూ. 3కోట్ల 57లక్షల 20వేలు నగదు జమ చేసినట్లు కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి చెప్పారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కును అందజేసి మాట్లాడారు. కొత్తగా వివాహం చేసుకున్న వారిలో అర్హులైన వారందరూ కళ్యాణమస్తు, షాదీతోఫా కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. జిల్లాలో బీసీ-ఎకు చెందిన 74 జంటలకు రూ. 37లక్షల 50వేలు, బీసీ-బికి చెందిన 51 జంటలకు రూ.28లక్షల 75వేలు, బీసీ-డికి చెందిన 406 జంటలకు రూ.2 కోట్ల 14లక్షల 75వేలు, బీసీ-ఈకి చెందిన మూడు జంటలకు రూ.3లక్షలు, ఓసీకి చెందిన ఒక జంటకు రూ.లక్ష 50వేలు, ఎస్సీకి చెందిన 63 జంటలకు రూ.4లక్షల 90వేలు, ఎస్టీకి చెందిన 6 జంటలకు రూ.6లక్షల 80వేలు వారి ఖాతాలలో నగదు జమ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.వరహ సత్యవతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల పేద ప్రజలకు పెద్దకొడుకుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వారి ఆర్థిక సమస్యలను తీర్చడమే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్నట్టు ఆమె తెలిపారు. అమ్మ ఒడి, పింఛన్లు, ఆసరా మొదలైన పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని ఆదుకున్నట్టు ఆమె చెప్పారు. అంతకు ముందు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన కార్యక్రమాన్ని అందరూ తిలకించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, ఏపీడీ డైజీ, బీసీ సంక్షేమశాఖ ఏడీ అజయ్ బాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకున్నారు...

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి
- ఉద్దానంలో కిడ్నీ రోగుల సంక్షేమం, మెరుగైన వైద్యం
- ఉమ్మడి జిల్లాలో విశేష రీతిలో ఉపాధి కల్పన
- త్వరలోనే విశాఖ రైల్వే జోన్ పనులు
- టీడీపీ హయాంలో చేసింది శూన్యం
- విలేకరులతో ఎంపీ సత్యవతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి : ఉత్తరాంధ్ర జిల్లాలు అభివృద్ధి బాటలో నడుస్తూ, శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధిరోగులకు డయాలసిస్ సెంటర్, పరిశుభ్రమైన తాగునీటి ప్రాజెక్టు వంటి అభివృద్ధిని చూసి టీడీపీ, జనసేన నేతలు ఓర్వలేక పోతున్నారని ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. స్థానిక తమ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ పాలనలో ఉద్దానంలో కిడ్నీ రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ మృత్యువాత పడుతుంటే పట్టించుకునే వారే లేరని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆస్పత్రి నిర్మించి రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని అన్నారు. ఏపీని రోల్ మోడల్ స్టేట్‌గా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్ష 40వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కరోనా సమయంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించి, వ్యాధి సోకిన రోగికి ప్రభుత్వం ద్వారా ఉచితంగా వారివారి ఇంటికి వెళ్లి మందులు అందించారని తెలిపారు. అటువంటి వ్యక్తులను సేవా వజ్ర, సేవా మిత్ర, సేవా రత్న అవార్డులతో సత్కరించడం జరిగిందన్నారు. ప్రతిపక్షాలకు సమాధానం చెప్పడానికి వలంటీర్ సేవలు చాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం ప్రైవేటీకరణ చేస్తుంటే అడ్డుకున్నది మన రాష్ట్ర ప్రభుత్వం అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కోట్లాది రూపాయల లాభాల్లో చూపించడంతో కేంద్రం ప్రైవేటీకరణకు వెనుకంజ వేసిందన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుకు గత సంవత్సరం ప్రధాని మోదీ విశాఖలో చెప్పడం జరిగిందని, ప్రస్తుతం పేపరు వర్కు జరుగుతుందన్నారు. జోన్‌కు 52 ఎకరాలు అనుకూలమైన స్థలంలో అన్ని పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించేందుకు రైల్వే డీఆర్‌ఎంతోను, రైల్వే మంత్రితో చర్చించడం జరిగిందన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో రూ.2వేల కోట్లతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు చేపడతామన్నారని, ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. చోడవరం పరిధిలో మూడు గ్రామాల ప్రజల వల్ల పనులు జాప్యం జరిగిందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఒక గ్రామానికి సంబంధించి సమస్య పరిష్కరించడం జరిగింది, మిగిలిన రెండు గ్రామాల ప్రజలతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. కరోనా కాలంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న పరిశ్రమలు అభివృద్ధి చేస్తూ, కొత్త పరిశ్రమలు తీసుకువచ్చి సుమారుగా లక్షమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై విపక్షాలు విమర్శలు చేయడం మానుకోవాలని ఆమె హితవు పలికారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు 8లో

నింగి..నేల..నీరు విన్యాసాల హోరు

- అబ్బురపరిచిన ఫైనల్ రిహార్సల్స్
- రేపు తుది ప్రదర్శన.. హాజరుకానున్న రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్

బీచ్‌రోడ్డు: బహుళ దేశాల నౌకాదళ విన్యాసాలు(మిలాన్-2024)కు విశాఖ సాగరతీరం సర్వసిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఫైనల్ రిహార్సల్స్‌ను మంగళవారం ఇండియన్ నేవీ ప్రదర్శించింది. మిగ్, హాక్ విమానాలు, చేతక్ హెలికాప్టర్లు, హెవీ హెలికాప్టర్ల విన్యాసాలు, పారాచూట్ డ్రైవ్‌లు, విపత్తులు, తీవ్రవాదులు దాడులు చేసిన సమయంలో చేసే ఆపరేషన్లను కమాండోలు అద్భుతంగా ప్రదర్శించి అబ్బురపరిచారు. అనంతరం జరిగిన సిటీ పరేడ్, రక్షణ బలగాల కవాతు, సంప్రదాయ నృత్య ప్రదర్శన, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ ప్రదర్శన ఆకట్టుకుంది. మిలాన్ 2024లో భాగంగా 50కు పైగా దేశాలతో భారత నేవీ హార్బర్ ఫేజ్ విన్యాసాలు, సిటీ పరేడ్ గురువారం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ హాజరుకానున్నారు.



సాగరతీరంలో విన్యాసాలు



కవాతు చేస్తున్న నేవీ సిబ్బంది



తిలకిస్తున్న జనం

...ప్చ్... రెండో రోజూ స్పందన కరువు

- చప్పగా లోకేష్ శంఖారావం



మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో వెల వెలబోయిన శంఖారావం సభ

మాడుగుల/మాడుగుల రూరల్ : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎన్నికల శంఖారావం సభ రెండో రోజూ చప్పగా సాగింది. మాడుగుల నియోజకవర్గంలో ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో ఉదయం 10 గంటలకు జరగాల్సిన శంఖారావం సభ జనం లేక 11.15 గంటలకు ప్రారంభమైంది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ సభకు అధ్యక్షత వహించారు. ఇప్పటికే మాడుగుల నియోజకవర్గలలో టీడీపీ మూ డు వర్గాలుగా చీలిపోయి ఉంటే అందులో ఒకరికే మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. రెండు పర్యాయాలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడును చినబాబు చిన్న చూపుగానే చూశాడు. ఈ నియోజకవర్గం నుంచి దేశం పార్టీ టికెట్టు ఆశించే నియోజకవర్గం నాయకుడు పైలా ప్రసాద్‌రావుకి కూడా సభలో పరాభవం తప్పలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కోట్లాది రూపాయలతో గ్రామీణ ప్రాంతంలో రహదారుల అభివృద్ధి పనులు చేపట్టగా.. కనీసం గుంతలు కప్పలేదని లోకేష్ విమర్శించడంపై అవగాహన లేకుండా ప్రసంగించారని పలువురు చర్చించుకున్నారు. కేంద్రం పరిధిలో వున్న విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు సీఎం జగన్ కారకులని అనడం కూడా అవగాహన రాహిత్యంగా వుందని చెప్పుకుంటున్నారు.

పసలేని ప్రసంగం

కోటవురట్ల : టీడీపీ నేత నారా లోకేష్ ప్రసంగం జనాలకు బోరు కొట్టించడంతో కొందరు సభా ప్రాంగణాన్ని విడిచి వెళ్లిపోయారు. కోటవురట్లలో టీడీపీ యువనేత నారా లోకేష్ శంఖారావం సభ నిండుగా కనిపించాలనే తపనతో మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న ఎకరా స్థలంలో స్టేజీ నిర్మించారు. స్పీచ్‌లో తడబడి నోరుజారడం అలవాటైన లోకేష్ మరోసారి తికమకపడ్డారు. మత్స్యకారులే లేని కోటవురట్ల మండలంలో మత్స్యకారులకు పడవలు, వలలు అంటూ ఏదేదో మాట్లాడారు. ఇక్కడ ఎక్కువగా చేనేత కార్మికులు ఉన్నారని విన్నానంటూ వారికి వలలు, పడవలు అంటూ చివరలో మత్స్యకార సోదరులకు అంటూ కవర్ చేసుకునే ప్రయత్నం చేశారు. చెప్పిందే చెప్పి చిరాకు తెప్పించారు. రెడ్ బుక్ అంటూ పదే పదే బుక్ చూపించడంతో జనాలకు ఆ పుస్తకంలో ఏం ఉందో అర్థం కాక తలలు గోక్కున్నారు.

విజయ్ టికెట్ ఊసెత్తని లోకేష్ 8లో

క్లుప్తంగా

నేడు మెగా జాబ్ మేళా

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ తెలిపారు. ఎన్జీవో సంస్థ నిర్మాణ్ ఆధ్వర్యంలో మైక్రోసాఫ్ట్ కంపెనీ సహకారంతో నిర్వహించనున్న ఈ మేళాలో పదికి పైగా కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి నుంచి ఆపై ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ చదివిన నిరుద్యోగులు హాజరు కావాలన్నారు. విద్యార్హత, ఎక్స్‌పీరియన్స్ ఉంటే వాటికి సంబంధించిన జెరాక్సు ప్రతులు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో కూడిన రెజ్యూమెలతో ఉద్యోగ మేళాకు హాజరు కావాలని సూచించారు. వివరాల కోసం ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ హెచ్ సుధీర్‌ను 77806888683 సంప్రదించాలన్నారు.

30 మద్యం సీసాలు సీజ్



సీజ్ చేసిన సీసాలతో ఎస్ఐ కృష్ణారావు

గొలుగొండ: అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న షాపుపై దాడి చేసి 30 మద్యం సీసాలను సీజ్ చేశామని ఎస్ఐ కృష్ణారావు మంగళవారం తెలిపారు. మహిళపై కేసు నమోదు చేశామన్నారు. మద్యం గొలుసు దుకాణాలుపై నిఘా పెట్టామని, ఎవరైనా అక్రమంగా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి పల్లె...ప్రగతి పథాన..

- సంక్షేమానికి తోడుగా అభివృద్ధి పరుగులు
- అన్ని వర్గాలకూ మోదం కలిగించేలా జగనన్న సుపరిపాలన
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- 6 గ్రామాల్లో రూ.4.95 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



పాడుగుపాలెంలో సీసీ రోడ్లు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ఆర్లిలో మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: సుపరిపాలనలో రాష్ట్ర ప్రజల అభిమానాన్ని సీఎం జగన్ పొందారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలో ఆరు గ్రామాల్లో రూ.4.95 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలను మంగళవారం ఆయన నిర్వహించారు. పాడుగుపాలెంలో రూ.82 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, ఇంటింటి కుళాయిలను ప్రారంభించారు. చింతపాలెంలో రూ.25 లక్షలతో మంచి నీటి పథకం, ఇంటింటి కుళాయిలు, ఎ.కోడూరులో రూ.1.86 కోట్లతో మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలు, సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ భవనాలను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. అనంతరం రూ.43 లక్షలతో మరమ్మతులు పూర్తయిన వారాడ–ఉగ్గినవలస తారురోడ్డు, వి.సంతపాలెంలో రూ.54.60 లక్షలతో వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్, ఆర్బీకే, డ్రైనేజీలను, రామచంద్రపురంలో రూ.10లక్షలతో పూర్తయిన అంగన్‌వాడీ కేంద్రం, కె.కోటపాడులో రూ.37లక్షలతో ఆధునికీకరించిన ఎంపీడీవో కార్యాలయం భవనాన్ని ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్ పాలనలోనే సాకారమవుతోందన్నారు. మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఏ గ్రామం వెళ్లి చూసినా సీఎం జగన్ ఆశయం మేరకు సచివాలయం, ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ భవనాలు కనిపిస్తాయని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో మాయ మాటలకు ప్రజలు మోసపోయారన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మరలా మాయ మాటలతో మోసం చేసేందుకు చంద్రబాబు యత్నిస్తాడని విమర్శించారు. ప్రజలకు మంచి చేసిన సీఎం జగన్‌కు ప్రజలు ఎల్లప్పుడూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అల్లు సూర్యనారాయణ, ఎంపీడీవో అప్పలరాజు, ఏఈలు బాలాజీ అప్పారావు, అల్లు శ్వేత, లక్ష్మణరావు, ఏపీఎం వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు లెక్కల నాగ విజయలక్ష్మి, రొంగలి సూర్యనారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ ఏటుకూరి రాజేష్, ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను అడ్డుకున్నది మీరు కాదా?

- అభివృద్ధిని చూడలేని కబోదుల్లా టీడీపీ నాయకులు
- లోకేష్‌కు ప్రజల సమస్యలు ఏం తెలుసు
- అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌కుమార్

అనకాపల్లి: పేదలను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఆర్ఏఆర్ఎస్ సమీపంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తుంటే, టీడీపీ నాయకులే అడ్డుకున్నారని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన మంగళవారం స్థానిక రింగ్ రోడ్డులో మంత్రి అమర్‌నాథ్ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో భరత్‌కుమార్ మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిని కళ్లు ఉండి చూడలేని దుస్థితిలో టీడీపీ నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. మునగపాక మండలం నాగులాపల్లి సమీపంలో శంఖారావ యాత్రలో అనకాపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి చేయలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. మంత్రి అమర్‌నాథ్ 600 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు టీడీపీ–జనసేన నాయకులు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్ ఇక్కడ భూమిని పరిశీలించి రైతులదని చెప్పిన విషయాన్ని మరిచారా? అని ప్రశ్నించారు. 2019 నుంచి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన తమ ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు 14 ఏళ్ల పాలనలో చంద్రబాబునాయుడు ఏమి చేశారో లోకేష్‌కు తెలియదా? అని నిలదీశారు. నేటి పాలనలో గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు, అక్కడ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయలు కల్పించన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి, లోకేష్‌కు గుండుగీయించే రోజులు దగ్గర పడ్డాయన్నారు. రూ. 20 కోట్లతో అనకాపల్లి – చోడవరం – మాడుగుల రహదారి అభివృద్ధికి టెండర్ దశలో ఉందన్నారు. గత టీడీపీ పాలనలో 420 కేసు బుక్ చేసి సారా గోవింద... కబ్జా గోవింద రోజులు మర్చిపోయారా? అని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను ప్రశ్నించారు. కశింకోట ఆర్‌ఈసీఎస్‌ను ఏపీఈపీడీసీఎల్‌లో విలీనం చేసింది టీడీపీ హయాంలోనే అని విమర్శించారు. ప్రశాంత వాతావరణంలో నియోజకవర్గ ప్రజలు వ్యాపారాలు, ఉద్యోగాలు చేసుకుంటే, వారిని ఇబ్బందులు పాలు చేసేందుకు టీడీపీ, జనసేన పార్టీ కుళ్లు రాజకీయాలు చేస్తున్నాయన్నారు.

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని మూసివేసి రైతుల పొట్ట కొట్టిన రోజులు మార్చిపోయారా అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు, పార్టీ మండలాధ్యక్షుడు పెదిశెట్టి గోవింద, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, దేవాలయాల చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, కేఎం నాయుడు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు



గంజాయితో పోలీసులకు పట్టుబడ్డ నిందితులు

రోలుగుంట: మండలంలోని గంజాయి రవాణా ప్రాంతాల్లో కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్సై ఎల్.సురేష్, సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు చేశారు. అర్ల పంచాయతీలో ఆటోలో గంజాయిని తరలించడానికి సిద్ధమైన డ్రైవర్‌తో కలిపి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి ఆచూకీ తెలియడంతో పైలట్‌గా వ్యవహరించిన వ్యక్తి ద్విచక్ర వాహనం వదిలి పరారయ్యాడు. నిందితుల నుంచి 120 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 6 లక్షలుగా అంచనా. రవాణాకు వినియోగించిన ఆటో, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. జి.మాడుగుల మండలం కొయిగుంటలో గంజాయి కొనుగోలు చేసి అడ్డ తోవ ద్వారా రోలుగుంట మండలం అర్ల పంచాయతీకి తరలించి ఆటోలో లోడు చేస్తూ పట్టుబడ్డారు. వారిలో అర్ల పంచాయతీకి చెందిన బాణం ధర్మరాజు(33), రత్నంపేటకు చెందిన బోరెపు గంగన్నదొర(35), చోలాపేట స్వామినాయుడు(30), బి.బి.పట్నం గ్రామానికి చెందిన పాత నేరస్తుడు బియ్యాల అప్పలనాయుడు (27) ఉన్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్టు ఎస్సై తెలిపారు. వీరిలో అప్పలనాయుడుపై పీడీ యాక్టు ఉందన్నారు.

విజయ్ టికెట్ ఊసెత్తని లోకేష్

- అయ్యన్నపాత్రుడు, కుమారుడు విజయ్ నిరుత్సాహం



సభలో ప్రతిజ్ఞ చేయిస్తున్న లోకేష్

నర్సీపట్నం: అనకాపల్లి పార్లమెంట్ టికెట్‌పై శంఖారావం సభలో నారా లోకేష్ ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును, కొడుకు విజయ్‌ను నిరుత్సాహ పరిచింది. ఇటీవల కె.కోటపాడు సభలో అయ్యన్నపాత్రుడు తమ అబ్బాయి విజయ్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలని దరఖాస్తు చేశాని.. అధిష్టానం ఇస్తే తన కొడుకునూ ఆదరించాలని కోరారు. అయినప్పటికీ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. మంగళవారం నర్సీపట్నం శంఖారావం సభలోనూ పార్లమెంటు టికెట్‌పై లోకేష్ స్పందించలేదు. దీంతో విజయ్‌ను పక్కన పెట్టినట్టేనని ఆ పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. సభలో మాట్లాడే అవకాశం కూడా విజయ్‌కు దక్కలేదు. లోకేష్‌ను మెప్పించడం కోసం అయ్యన్నపాత్రుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై నోరు పారేసుకున్నారు. 2.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సభకు మధ్యాహ్నం ఒంటి గంటకే లోకేష్ చేరుకున్నారు. జనాలు రావటం ఆలస్యమై నిర్దిష్ట సమయానికి సభ ప్రారంభం కాలేదు.

ప్రజాస్వామ్య ప్రభుత్వాలకే ప్రజల కష్టాలు తెలుస్తాయి

అనకాపల్లి : ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజలచే ఎన్నికోబడిన నాయకులకు ప్రజల కష్టాలు తెలుస్తాయని, దొడ్డిదారిన ఎమ్మెల్సీ కోటాలో (టీడీపీలో) మంత్రి అయిన నారా లోకేష్‌కు ప్రజల బాధలు తెలియవని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ప్రణాళికాబద్ధంగా పౌష్టికాహార సరఫరా

- కలెక్టర్ రవిపట్టన్ శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టన్ శెట్టి

అనకాపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల తల్లులకు అందించే పౌష్టికాహార సరఫరా ప్రణాళికాబద్ధంగా చేయాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశించారు. జిల్లాలోని సీడీపీవోలు, పీహెచ్‌సీల వైద్యులు, ఎంఈవోలతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌష్టికాహారంతో పాటు తల్లి పాలు, తృణధాన్యాలు ఎక్కువగా వాడేలా అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాలు అంగన్‌వాడీ కేంద్రాల పనితీరులో రక్తహీనత గలవారిని గుర్తించి తగిన పౌష్టికాహారం, మందులు వాడేలా చైతన్యపరచాలన్నారు. రక్తహీనత గల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డీఎంఅండ్‌హెచ్‌వో ఎ.హేమంత్, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, శిశుసంక్షేమ శాఖ అధికారులు అనంతలక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో ఒక్క రోడ్డూ బాగు చేయలేదు

- లోకేష్ సభకు జనం లేక పిచ్చిప్రేలాపనలు
- వైఎస్సార్‌సీపీ వచ్చాక రూ. 3 వేల కోట్లతో అభివృద్ధి చేశాం
- దీనిపై గ్రామాల్లో చర్చకు సిద్ధమా..
- టీడీపీ నాయకులపై ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ఆగ్రహం



చోడవరంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: బుచ్చెయ్యపేట మండలంలో వడ్డాది సభకు జనం లేకపోవడంతో సహనం కోల్పోయిన టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తే, చూస్తూ ఊరుకోబోమని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వడ్డాదిలో టీడీపీ శంఖారావం సభకు ప్రజల నుంచి కనీస స్పందన లేదన్నారు. నారా లోకేష్ అడ్డదారిలో మంత్రి అయ్యి, పదవిలో ఉన్నంత కాలం చోడవరం నియోజకవర్గాన్ని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు అభివృద్ధే జరగలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేనంత అభివృద్ధి తమ ప్రభుత్వం చేసిందన్నారు. మంచినీరు, మౌలిక వసతులు, రోడ్లు, ఆరోగ్య కేంద్రాలు ఇలా అన్ని విధాలుగా రూ.3 వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. టీడీపీ హయాంలో దెబ్బతిన్న గతుకుల రోడ్లను ఒక్కటీ బాగుచేయలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గంలో అన్ని రోడ్లను రూ.300 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. దీనిపై ఏ గ్రామంలో చర్చ పెట్టినా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఇంత అభివృద్ధి లోకేష్‌కు కనిపించలేదా? అని ప్రశ్నించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని టీడీపీ పాలకవర్గం, అప్పటి ప్రభుత్వం దోచుకుందని, రూ.150 కోట్లు అప్పుల ఊబిలోకి తోసేసి రైతులను నిండా ముంచేసిందని ధ్వజమెత్తారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రూ. 110 కోట్లు గ్రాంటు రూపంలోనూ, వడ్డీలేని రుణం తెచ్చి ఫ్యాక్టరీని అప్పుల ఊబిలోంచి బయటకు తీసుకొచ్చామన్నారు. కొత్తగా ఇథనాల్ పరిశ్రమ పెట్టి, రైతులకు టన్నుకు రూ. 3500 ఇచ్చేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఫ్యాక్టరీకి, చెరకు రైతులకు ఏదైనా మేలు జరిగిందంటే అది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్లేనని గుర్తుపెట్టుకోవాలన్నారు. కనీసం రూ.10 కోట్లు గ్రాంట్‌గా ఇవ్వలేని టీడీపీ ఇప్పుడు ఫ్యాక్టరీని బాగు చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు తనపై లేనిపోని విమర్శలు చేస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్డాదిలో కనీసం ఒక్క ఎంపీటీసీ గెలిపించుకోలేకపోయాడని, అలాంటి వ్యక్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, పప్పు సుద్ద లోకేషను పట్టుకుని గోదారి ఈదుతూ వైఎస్సార్‌సీపీపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

సభకు జనం రాకపోతే సహనం కోల్పోయి చౌకబారు ప్రేలాపనలు మానుకొని హుందాతనంగా రాజకీయాలు చేస్తే మంచిదని హితవుపలికారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు పాల్గొన్నారు.

మరిన్ని విజయాలు సాధించాలి



కబడ్డీ జట్టును ఖోఖో జట్టును అభినందిస్తున్న జాయింట్ కలెక్టరు జాహ్నవి

- జాతీయ క్రీడలకు ఎంపిక కావాలి
- ఆడుదాం–ఆంధ్రా విజేతలను అభినందించిన జేసీ జాహ్నవి

అనకాపల్లి : క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జేసీ ఎం.జాహ్నవి అన్నారు. ఆడుదాం – ఆంధ్రా క్రీడల్లో విజయం సాధించిన జిల్లా ఖోఖో, కబడ్డీ జట్లను ఆమె మంగళవారం అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ద్వితీయస్థానం సాధించిన తుమ్మపాల–2 ఖోఖో జట్టు, తృతీయస్థానం పొందిన సాలాపువానిపాలెం కబడ్డీ జట్లను ఆమె అభినందించారు. క్రీడల్లో మరింత తర్ఫీదు తీసుకొని జాతీయ క్రీడలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. గత డిసెంబర్ 26 నుంచి ప్రారంభమైన ఆడుదాం– ఆంధ్రా పోటీల్లో రాష్ట్ర స్థాయి ఫైనల్స్‌లో జిల్లా జట్టు బాపట్లతో తలపడి ద్వితీయస్థానం సాధించి రూ.3 లక్షలు, పతకం, ధ్రువీకరణ పత్రాలతోపాటు ట్రోఫీని కైవసం చేసుకుంది. కబడ్డీ జట్టు సెమీఫైనల్స్‌లో చిత్తూరు జిల్లాపై విజయం సాధించి రూ.లక్షతో పాటు పతకం, ధ్రువీకరణ పత్రాలతోపాటు ట్రోఫీని సాధించుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాధికార క్రీడా అధికారి రమణ, కోచ్ పి.వి.నాగేశ్వరరావు, కబడ్డీ కోచ్, ఫిజికల్ డైరెక్టర్లు డి.ఎస్.శ్యాం ప్రసాద్, సత్యవతి, ఖోఖో జట్ల కెప్టెన్ నవీన్, కబడ్డీ కెప్టెన్ కె.త్రివేణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సిమెంటు దిమ్మెను ఢీకొట్టిన బైక్

- రికవరీ ఏజెంట్ దుర్మరణం



మృతి చెందిన ఈరిగల ప్రసాద్

యలమంచిలి రూరల్: పట్టణానికి సమీపంలో సైతారుపేట రోడ్డులో పెంజెరువు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో లోన్ల రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్న యువకుడు ఈరిగల ప్రసాద్(26) దుర్మరణం చెందాడు. పట్టణ ఎస్సై కె సావిత్రి నాయుడు వివరాల ప్రకారం.. స్థానిక గాంధీనగర్ ఎస్సీ కాలనీకి చెందిన ప్రసాద్ సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఎస్. రాయవరం మండలం వెలంపాలెంలో ఓ ద్విచక్ర వాహనం లోన్ రికవరీ కోసం వెళ్లి తిరిగి తన బైక్‌పై యలమంచిలి వస్తుండగా.. పెంజెరువు సమీపంలో రోడ్డు పక్కన సిమెంటు దిమ్మెను ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు, మెడ భాగానికి బలమైన గాయాలయ్యాయి. వెంటనే యలమంచిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు అక్కడ వైద్యుడు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కన్నీరుమున్నీరైన కుటుంబం...

మృతుడు తండ్రి యలమంచిలి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతని పెద్ద కుమారుడు ప్రసాద్‌కు వివాహం చేయడానికి ఇటీవల పెళ్లి సంబంధాలు వెతుకుతున్నారు. ఇంతలో చేతికందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తల్లి మహాలక్ష్మి, తమ్ముడు రామ్‌కుమార్ గుండెలు బాదుకుంటూ రోదించడం చూపరులను సైతం కన్నీరు పెట్టించింది. ఈ ఘటనతో ఎస్సీ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అప్పటివరకూ తమతో సరదాగా గడిపిన కొద్ది సేపటికే ప్రసాద్ ఊహించని విధంగా రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడాన్ని స్నేహితులు నమ్మలేకపోతున్నారు. వారంతా పెద్ద ఎత్తున అంత్యక్రియల్లో పాల్గొని తమ సంతాపాన్ని తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

లక్ష దీపోత్సవం.. భక్తజనుల పరవశం



ప్రమిదలు వెలిగిస్తున్న మహిళలు

- నర్సీపట్నంలో కనుల పండువగా లక్ష ప్రమిదల దీపారాధన



సాయినాథుని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో లక్ష ప్రమిదల దీపాలంకరణ కార్యక్రమం కనుల పండుగగా జరిగింది. షిర్డీసాయి మందిరం కమిటీ ఆధ్వర్యంలో 22 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా పట్టణంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జ్యోతులు వెలిగించేందుకు పోటీ పడ్డారు. ఈ దీపాలంకరణ పూర్తయ్యే సరికి గంట సమయం పట్టింది. దీపాల కాంతులు పూర్తి కావడంతో ఒక్కసారిగా స్టేడియంలో పండగ వాతావరణ నెలకొంది. ఓం ఆకారం ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. కార్యక్రమంలో భాగంగా భారీ మందుగుండు సామగ్రి పేలుళ్లు మిరమిట్లు గొలిపాయి. ముందుగా స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ లక్ష ప్రమిదల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు భీష్మ ఏకాదశి లక్షల ప్రమిదల దీపారాధనోత్సవం ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు తమవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి రాంగోపాల్, కమిటీ పెద్దలు డాక్టర్ రామచంద్రరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'నేడు జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం

అనకాపల్లి: స్థానిక 84వ వార్డు గొల్లవీధి యూపీహెచ్‌సీలో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్సీ అయ్యప్పనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు, ఒక గైనకాలజిస్ట్, కంటి వైద్యులు, వైద్యసిబ్బంది సేవలు అందిస్తారని పేర్కొన్నారు. రోగులకు రక్త పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారని తెలిపారు. ఆపరేషన్ అవసరమైన రోగులను వేరే ఆస్పత్రులకు రిఫర్ చేస్తారని తెలియజేశారు. భీమునిగుమ్మం సచివాలయ పరిధిలో ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

త్రిపురాంతకస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన



శివలింగాన్ని బిల్వ పత్రాలతో అర్చిస్తున్న అర్చకులు

కశింకోట: కశింకోటలోని సర్వకామదాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం లక్ష బిల్వ పత్రార్చన వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చురుగ్గా బాల సదనం అభివృద్ధి పనులు



కశింకోట బాల సదనంలో మొక్కలు నాటడానికి పూడ్చుతున్న మట్టి

కశింకోట: కశింకోటలోని బాల సదనాన్ని అభివృద్ధి చేస్తున్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షలతో చుట్టూ మొక్కలు నాటడానికి మట్టి వేసి పూడ్చే పనిని చేపట్టారు. అనంతరం మొక్కలు నాటుతామని సదనం ప్రతినిధులు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 6,211 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,690	4,700
మొదటి రకం	3,540	4,250
రెండో రకం	3,470	3,770
మూడోరకం	3,200	3,460

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
నాగద్వీపం (తెలుగు):	సత్యనారాయణస్క్రీన్-1
మేడెన్ వెబ్(రెండు షోలు):	సత్యనారాయణ స్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన:	పర్తిసాయి
ఓయ్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 72 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-23 యూనిట్లు, బీ పాజిటివ్-28 యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరు ద్వారా సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 369 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 322 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరు ద్వారా సంప్రదించవచ్చు.

సరి'కొత్తపల్లి'

- కోటిన్నర రూపాయలకు పైగా నిధులతో అభివృద్ధి
- గ్రామస్తుల హర్షం





సిద్ధమైన కొత్తపల్లి సచివాలయ భవనం



నాడు-నేడులో తీర్చిదిద్దిన ఆదర్శ ప్రాథమిక పాఠశాల



నాడు-నేడులో అభివృద్ధి చేసిన కొత్తపల్లి హైస్కూలు



కొత్తగా నిర్మించిన టాయిలెట్లు

కశింకోట: కొత్తపల్లి సచివాలయ పరిధిలోని ప్రాంతాలు అనూహ్య రీతిలో అభివృద్ధి చెందడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో రూ.కోటిన్నర పైబడిన నిధులతో అభివృద్ధి చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రాధాన్యత భవనాలు, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి 'నాడు-నేడు'లో పాఠశాలలు ఎంతగానో అభివృద్ధి చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి సచివాలయంలో కొత్తపల్లి, బుచ్చియ్యపేట పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 3 వేలు పైబడిన జనాభా ఉంది. సచివాలయ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా మారుమూల ఉన్న ప్రాంతంలో కొత్తపల్లి కేంద్రంగా సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. దానిలో సిబ్బందిని నియమించి విరివిగా ప్రభుత్వ సేవలు ఉచితంగా అందుబాటులోకి తేవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ పని కావలసి వచ్చినా ఎంతో ఇబ్బంది పడి కశింకోటకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు సచివాలయం ఇక్కడే ఏర్పాటు చేయడంతో ఇక్కట్లు తప్పాయని చెబుతున్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్యాలయ భవనంలో నిర్వహిస్తున్న సచివాలయానికి నూతనంగా రూ.25 లక్షలతో పై అంతస్తులో భవనాన్ని నిర్మించారు. అతి త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేశారు. దీని పక్కనే రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్ర భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇది తుది దశకు చేరుకుంది.

నాడు-నేడులో రెండు పాఠశాలల అభివృద్ధి

నాడు-నేడులో రెండు పాఠశాలలను రూ.60 లక్షలతో అభివృద్ధి చేశారు. హైస్కూల్‌ను రూ.42 లక్షలు, ప్రాథమిక పాఠశాలను రూ.18 లక్షలతో తీర్చిదిద్దారు. పాఠశాలలకు రంగులు, భోజనశాలల నిర్మాణం, టాయిలెట్లు, చేతులు శుభ్రపరచుకునేందుకు ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. పాఠశాల చుట్టు మొక్కలు నాటడంతో అవి ఏపుగా ఎదిగి, నీడను ఇస్తున్నాయి. మరో రూ.15 లక్షలతో అదనపు భవనం నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

- పొలాలకు వెళ్లే మార్గంలో కొత్తపల్లిలో రూ.6 లక్షలతో సిమెంట్ రోడ్డు, ఉపాధి పథకం నిధులతో బుచ్చియ్యపేట పంచాయతీలో రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీలను నిర్మించారు. ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని రూ.2 లక్షలతో రంగులు వేసి అభివృద్ధి చేశారు. త్వరలో జల జీవన్ మిషన్ కింద ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ భవన నిర్మాణం	రూ.25 లక్షలు
నాడు-నేడులో హైస్కూలు అభివృద్ధి	రూ.42 లక్షలు
నాడు-నేడులో ప్రాథమిక ఆదర్శ పాఠశాల	రూ.18 లక్షలు
రైతు భరోసా కేంద్రం నిర్మాణం	రూ.21.80 లక్షలు
కొత్తపల్లిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం	రూ.6 లక్షలు
బుచ్చియ్యపేటలో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం	రూ.30 లక్షలు
హైస్కూల్లో నూతన భవనం	రూ.15 లక్షలు

మా స్కూల్ ఎంతో బాగుంది



నేను కొత్తపల్లి హైస్కూల్లో టెన్త్ చదువుతున్నాను. మాది కశింకోట అయినా అమ్మమ్మ వాళ్లింట్లో ఉండి ఒకటో తరగతి నుంచి ఇక్కడే చదువుకుంటున్నా. మా స్కూల్ ఇప్పుడు ఎంతో బాగుంది. క్లాస్‌రూమ్స్ బాగున్నాయి. టాయిలెట్లు నిర్మించారు. కార్పొరేట్ స్కూల్లో ఉన్న సదుపాయాలన్నీ కల్పించారు. జగన్ మామయ్యకు ధన్యవాదాలు.

– అంబటి భవాని, టెన్త్ విద్యార్థి

ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయి



ఆరోగ్య ఉప కేంద్రాన్ని అందంగా రంగులు వేసి అభివృద్ధి చేశారు. వైద్య సదుపాయాలు బాగా అందుతున్నాయి. సిబ్బంది వచ్చి సేవలు అందించి, ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు కేంద్రంలో సేవలు పొందుతున్నాం.

–నల్లగుండు అప్పారావు, కొత్తపల్లి

అందుబాటులోనే సేవలు



మాది కొత్తపల్లి. నాలుగేళ్ల క్రితం పది సెంట్ల వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. అప్పుడే సచివాలయంలో దరఖాస్తు చేస్తే ఉచితంగానే పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చారు. అప్పటి నుంచి రైతు భరోసా రూ.13,500 కూడా వస్తోంది. ఆ తర్వాత భూముల రీసర్వేలో ఈ భూమి వివరాలు నమోదు చేసి, ఉచితంగా పట్టాదారు పాసు పుస్తకం అందజేశారు. గతంలో పట్టాదారు పాసు పుస్తకాల కోసం కశింకోట మండల కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక్కడే సచివాలయం రావడం వల్ల ఇబ్బంది లేకుండా దగ్గరలోనే సేవలు అందుతున్నాయి. ఖర్చు లేకుండా పట్టాదారు పాసు పుస్తకం వచ్చింది. సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– కలగొట్ల కోటేశ్వరరావు, రైతు, కొత్తపల్లి

సచివాలయాల ఆధునికీకరణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సూరిబాబు



వలంటీర్ నాయుడును సత్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి : మండల పరిధి 26 సచివాలయాలను ఫైబర్‌నెట్‌తో ఆధునికీకరించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం 11వ మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో పీవీపీఎం మోహనరావు ఆధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫైబర్‌నెట్ ద్వారా గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ సెంటర్లకు ఆన్‌లైన్ ద్వారా త్వరితగతిన పనులు జరుగుతాయని చెప్పారు. అర్హులైన 2800 మంది లబ్ధిదారులకు జగనన్న గృహాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జరిగిందని, కొన్ని గ్రామాల్లో ఆన్‌లైన్ సేవలు సరిగా పని చేయకపోవడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. మండలంలో 25 ఆర్‌బీకే కేంద్రాలు నిర్మించగా 22 కేంద్రాలకు పూర్తి చేశామన్నారు. నేటి వరకు నాలుగింటిని రైతులకు అందుబాటులోకి తీసుకు వచ్చామని, మిగిలిన కేంద్రాలకు రెండు, మూడు రోజుల్లో ప్రారంభోత్సవాలు చేస్తామన్నారు. ఆరోగ్య శ్రీ పథకం పథకం కోసం ముందుగా రోగుల పేర్లు యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా బోర్లు, మోటార్లు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. మండలంలో మెట్టపాలెం గ్రామంలో వోల్టేజీ సమస్య ఏర్పడిందని, త్వరలోనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామన్నారు. మండల పరిధిలో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నట్లయితే దగ్గరలో ఉన్న సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులకు గాని, గ్రామీణ పోలీసులను గానీ సంప్రదించాలన్నారు. మండలంలో 912 హ్యాండ్‌బోర్లు ఉన్నాయని, నూతనంగా మరో ఐదుబోర్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేపడుతున్నట్లు చెప్పారు.

అంతకు ముందు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వారి సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యుఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివ సత్యనారాయ (జోసెఫ్), మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ అయితా రాము, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఘన సత్కారం..

మండల ప్రజలకు పలు రకాల సేవలందిస్తున్న 15 మంది వలంటీర్లను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఘనంగా సత్కరించారు.

ఘనంగా గంగాదేవి ఉత్సవం



గంగాదేవిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



గంగాదేవి సారె ఊరేగింపుగా తీసుకువస్తున్న సింగవరం గ్రామస్తులు

కశింకోట: గంగాదేవి అమ్మవారి ఉత్సవాన్ని మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. మండలంలోని జి.భీమవరం వద్ద కొలువుదీరిన అమ్మవారిని చుట్టు పక్కల గ్రామాల భక్తులు దర్శించుకున్నారు. తల నీలాలు, చీరలు, రవికలు, అరటి గెలలు సమర్పించి, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆయనకు జ్ఞాపికను అందజేసి సత్కరించింది. అనంతరం సింగవరం గ్రామం నుంచి మహిళల కోలాటాలతో వచ్చిన ఉత్సవ సారె ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, సర్పంచ్ హనుమంతు వెంకట లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యులు శంకరరావు, అద్దంకి సతీష్, జి. భీమవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు లోవరాజు, తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ తదితరులు అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు.

కమనీయం.. కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న శర్మ

అనకాపల్లి: స్థానిక చినరాజుపేట శ్రీచౌడేశ్వరి సాంబ శివుని ఆలయంలో మంగళవారం మాఘశుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి వార్షిక కల్యాణ వేడుకలు కమనీయంగా జరిగాయి. స్వామివారి తరఫున బీరక శ్రావణ్‌కుమార్, అలేఖ్య దంపతులు, అమ్మవారి తరఫున రెడ్డి ప్రవీణ్‌కుమార్, జానకీప్రభ దంపతులచే ఆలయ ప్రధాన అర్చకులు కోమాళ్లపల్లి నందనశర్మ కల్యాణం నిర్వహించారు. అమ్మవారి సారె ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది. మహిళా భక్తులు పలు రకాల పిండివంటలు, మిఠాయిలు, పసుపు, కుంకుమ, అరటిపళ్లతో సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి నివేదించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు పరిసర ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నేడు

అనకాపల్లి: మరిడిమాంబ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు పదో తరగతి లోపు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'అందరికీ గ్రామ దేవత - గ్రామ దేవత మహిళ' అనే అంశంపై స్థానిక విజయ రామరాజుపేట మాధవ్ సదన్ హాల్లో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఆసక్తి గల విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న ప్రజలు



యోగాసనాలు వేసి చూపిస్తున్న బాబా

అనకాపల్లి: శరీరం ఆయుధమైతే, ఆరోగ్యం మన బానిస అవుతుందని పరమపూజ్య స్వామి రమేష్ దేవ్ బాబా మహారాజ్ అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో పతంజలి విశేష ఇంటిగ్రేటెడ్ యోగా శిక్షణలో భాగంగా మంగళవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన, యోగాసనాలను వేసి చూపించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఇంట్లో అందరూ యోగా, ధ్యానం చేస్తూ ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. యోగా ద్వారా మానసిక ఒత్తిడి, షుగర్, బీపీ, పలు దీర్ఘకాలిక వ్యాధులు దూరం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో రథివేష్‌స్వామి, పతంజలి భారత్ స్వాభిమాన్ జిల్లా అధ్యక్షుడు బీడీ.నాయుడు, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి కాండ్రేగుల విష్ణుమూర్తి, జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడుగురికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్ చేయించుకున్న వారితో రవిరాం జవహర్, ఆస్పత్రి సిబ్బంది

అనకాపల్లి: స్థానిక రోటరీ కంటి ఆస్పత్రిలో ఏడుగురికి డాక్టర్ కె.మల్లీశ్వరరావు మంగళవారం కంటి ఆపరేషన్లు చేశారు. సోమవారం ఆస్పత్రిలో జరిగిన కంటి వైద్య పరీక్షలకు 25 మంది హాజరు కాగా, వారిలో ఏడుగురికి నేత్ర శస్త్రచికిత్సలు అవసరం అయ్యాయని వైద్యులు చెప్పారు. వారికి మంగళవారం ఆపరేషన్ చేసి, ఐదురోజులకు సరిపడా మందులు ఉచితంగా అందించామని తెలిపారు. ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా 'ఇంటింటికీ గోవిందుడు'



పూజలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: గ్రేటర్ విశాఖ విలీన గ్రామం కేఎస్‌ఆర్ పేటలో వి.గంగలక్ష్మి, పెంటారావు దంపతుల గృహంలో మంగళవారం ఇంటింటికీ గోవిందుడు పూజ నేత్రపర్వంగా జరిగింది. గణపతి పూజతో మొదలై ఓం నమో వెంకటేశా భజనతో ముగిసింది. పలు రకాల పిండివంటలను స్వామివారికి నివేదించి, అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో భజన గురువు చూచుకొండ రమణ, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతాలు



అనకాపల్లి: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక సుంకరమెట్ట సత్య, సూర్యనారాయణస్వామి ఆలయంలో నిర్వహించిన సామూహిక సత్య దేవుని వ్రతాల్లో 50 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కేఎం.నాయుడు, ఈవో కీర్తి ఆదినారాయణ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

వేడుకగా చింతాలమ్మ తల్లి పండగ

అనకాపల్లి: మండలంలోని ఊడేరు గ్రామంలో చింతాలమ్మతల్లి పండగను భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుండే చుట్టుపక్కల ఉన్న భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. దీంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించి తరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి ఆలయ శత వార్షికోత్సవం



అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సుగంధ ద్రవ్యాలతో అభిషేకిస్తున్న రామాచార్యులు



108 కలశాలతో మహిళా భక్తుల శోభాయాత్ర



కల్యాణం నిర్వహిస్తున్న రామాచార్యులు

అనకాపల్లి : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఆలయ శత వార్షికోత్సవం నేత్రపర్వంగా జరిగాయి. రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో 108 కలశాలతో శోభాయాత్ర ఆలయం నుంచి ప్రారంభమై మెయిన్ రోడ్డు గుండా పెరుగు బజారు కూడలి, చిన్న వీధి, మళ్లవరపువారి వీధి మీదుగా ఆలయానికి చేరుకుంది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఊరేగించారు. అడుగడుగునా అమ్మవారికి భక్తులు హారతులు పట్టి దర్శించుకున్నారు. అంతకు ముందు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. సాయంత్రం ఆలయ మండపంలో శ్రీ వింధ్యావాసిని దేవి, శ్రీ నగరేశ్వరస్వామి, శ్రీకోన కమలాదేవి, శ్రీ జనార్దన స్వామి వార్ల కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శతజయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం



బీసీ సంక్షేమ వసతి గృహంలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు

కశింకోట : స్థానిక బీసీ సంక్షేమ వసతి గృహ విద్యార్థుల సౌకర్యార్థం ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి సమకూర్చిన రూ. 10 లక్షల ఎంపీ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ఇక్కడ గత నాలుగేళ్ల నుంచి మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో మరుగు దొడ్లకు ఆరు బయటకు వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయం ఎంపీ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి తొలిసారిగా నిధులను సమకూర్చారని వసతి గృహం సీఈవో నారాయణరావు తెలిపారు. వాటితో 4 మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.